సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్‌: బురుజుపేటలో వెలసిన కనమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఈవో శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్‌ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌వో ప్లాంట్లలో అధికారుల తనిఖీలు



ఆర్‌వో ప్లాంట్‌ యజమానిని ప్రశ్నిస్తున్న విజిలెన్స్‌ అండ్‌ ఫుడ్‌ సేఫ్టీ అధికారులు

అల్లిపురం: ఆర్‌వో ప్లాంట్లలో విజిలెన్స్‌, ఫుడ్‌ సేఫ్టీ అధికారులు సంయుక్తంగా శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. అల్లిపురం నీలమ్మవేపచెట్టు దరి హెచ్‌ఎం వాటర్‌ ప్లాంట్‌, బొడారా రోడ్డులోని గోకుల్‌ థియేటర్‌ వద్ద గల సాహితీ ఆక్వా డ్రింకింగ్‌ వాటర్‌ ప్లాంట్‌, అక్కయ్యపాలెం, శ్రీనివాసనగర్‌లో గల రాజు వాటర్‌ సర్వీసెస్‌ ప్లాంట్లలో తనిఖీలు చేపట్టారు. ప్లాంట్ల యాజమాన్యాల నుంచి లైసెన్స్‌లు, సంబంధిత డాక్యుమెంట్లు, నాణ్యతా ప్రమాణాలను ఫుడ్‌ సేఫ్టీ అధికారులు పరిశీలించారు. వాటర్‌ శాంపిల్స్‌ తీసుకుని స్టాప్‌ సేల్‌ నోటీసులు అందజేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్‌ డీసీటీవో పి.రేవతి, ఏఈఈ రామ్‌గోపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రతాపరెడ్డిపై దాడి హేయమైన చర్య

విశాఖ విద్య: ఆర్జేడీ ప్రతాపరెడ్డిపై దాడి హేయమైన చర్య అని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి. గోపీనాథ్‌, ఎం. శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్యంలో భౌతికదాడులు సరైన పద్ధతి కాదన్నారు. విద్యాశాఖ పనితీరు పురోగతికి ఆర్జేడీ ప్రతాపరెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అలాంటి అధికారికి పీఆర్‌టీయూ అండగా నిలుస్తుందన్నారు.

సేవతోనే జీవితానికి సార్థకత



నిరుపేదలకు నిత్యావసరాలు అందించిన కోన జగదీశ్వరరావు

అల్లిపురం: సేవతోనే జీవితానికి సార్థకత లభిస్తుందని ప్రేమసమాజం కార్యదర్శి కోన జగదీశ్వరరావు పేర్కొన్నారు. కోన కుంచయ్య చారిటబుల్‌ ట్రస్ట్‌, విజయసాయి యోగా చారిటబుల్‌ ట్రస్ట్‌ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కార్మికులు, నిరుపేదలకు నిత్యావసర వస్తువుల పంపిణీ చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌ డైరెక్టర్లు మహాలక్ష్మి, అప్పలరాజు, మురళీకృష్ణ, అవినాష్‌, రవికుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా! లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!

సంప్రదించవలసిన నెంబరు

వైజాగ్‌ సౌత్‌

7997958342, 9912440606

దశ వసంతాల సేవా లోగిలి

- తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న స్వామి వివేకానంద సంస్థ
- అనాథ వృద్ధులకు సకల సౌకర్యాలతో బాసట
- వైఎస్సార్‌ పెన్షన్‌ సొమ్ముతో వయసుడిగిన వారికి బంగారు వస్తువులు



వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ (ఫైల్‌)



మహానేత వైఎస్సార్‌ వర్ధంతి సందర్భంగా వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న ద్రోణంరాజు శ్రీవత్సవ్‌ (ఫైల్‌)



మేము సైతం అంటూ బీచ్‌రోడ్డులో జాతీయ జెండాలతో వృద్ధుల ర్యాలీ (ఫైల్‌)

డాబాగార్డెన్స్‌: పాతనగరంలో గల స్వామి వివేకానంద సంస్థ ఏర్పడి ఈ నెల 19 నాటికి పదేళ్లు. 2014 ఫిబ్రవరి 19న రామకృష్ణ పరమహంస జయంతి సందర్భంగా వివేకానంద వృద్ధాశ్రమాన్ని ప్రారంభించారు. ఒక వృద్ధురాల్ని కొంత మంది స్థానికులు తీసుకొచ్చి, ఆమెకు ఆశ్రమం కల్పించమని కోరారు. కుమారుడు, కోడలు రోడ్డుపై వదిలి వెళ్లిపోయారని చెప్పడంతో వెంటనే ఆ వృద్ధురాలికి ఆశ్రయం కల్పించారు. అప్పట్లో సంస్థచే నిత్యాన్నదాన కార్యక్రమం కూడా ఉండేది. పిల్లలు ఉండీ కూడా కొంత మంది తల్లిదండ్రులు (వృద్ధులు) రోడ్డున పడడాన్ని జీర్ణించుకోలేక అటువంటి వారిని ఆదుకోవాలన్న సత్సంకల్పంతో వృద్ధాశ్రమాన్ని స్థాపించారు. ఈ నెల 19 నాటికి తొమ్మిదేళ్లు పూర్తి చేసుకుని పదవ సంవత్సరంలోకి అడుగిడుతుంది. ప్రారంభంలో ఆరుగురితో ప్రారంభమైన ఈ సంస్థ ప్రస్తుతం 15 మంది వృద్ధులకు అన్నీ తానై సేవలందిస్తోంది. మధ్యలో చాలా మంది కాలం చేశారు. వారు చనిపోయినప్పుడు అప్పటి ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాస్‌, సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్‌ సీఎంఏ జహీర్‌ అహ్మద్‌ పాడె మోసి దహన సంస్కారాలు చేయడం విశేషం. వీరందరికీ కాశీలో పిండి ప్రదానం చేశారు.

సకల సౌకర్యాలు..

ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులందరికీ ఉదయం టీ, టిఫిన్‌, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్‌, టీ, రాత్రి భోజనం అందిస్తున్నారు. ప్రతి నెలా బీపీ, షుగర్‌ పరీక్షలు చేయించి మందులు ఇప్పిస్తున్నారు. వారికి అనారోగ్యం వస్తే ఏఎస్‌ బీచ్‌ హాస్పిటల్‌ డాక్టర్‌ జహీర్‌ అహ్మద్‌ ఉచితంగా వైద్యం అందిస్తున్నారు.

వచ్చిన పెన్షన్‌తో..

సంస్థలో ఉన్న వృద్ధులందరికీ వైఎస్సార్‌ పెన్షన్‌ వస్తోంది. ప్రతి నెలా వచ్చిన పెన్షన్‌ డబ్బులను వారి పేరిట బ్యాంకులో జమ చేస్తున్నారు. వారికి ఎటువంటి ఖర్చులు లేకపోవడంతో బ్యాంకులో ఉన్న నగదుతో వారికి బంగారు వస్తువులు కొని ప్రముఖుల చేతుల మీదుగా వారికి అందిస్తున్నారు. ఈ బంగారు వస్తువులు చూసైనా బంధువులు వస్తారన్న ఓ చిన్ని ఆశ సంస్థది.

తీర్థయాత్రలు..

పలువురు దాతల సహకారంతో వృద్ధులందర్నీ తీర్థయాత్రలకు తీసుకెళ్తున్నారు. కాశీ, రామేశ్వరం, గయా, ప్రయోగ, కోల్‌కత్తా, కన్యాకుమారి, మధుర, అరుణాచలం, శ్రీశైలం, మహానంది, తిరుపతి, విజయవాడ, సింహాచలం తదితర పుణ్యక్షేత్రాలకు తీసుకెళ్లి వారిని ఆనందింపజేస్తున్నారు. వచ్చే నెలా వీరందర్నీ మరోసారి కాశీయాత్రకు తీసుకెళ్లనున్నారు. కరోనా సమయంలో వృద్ధులకు పోషకాహారాన్ని అందజేశారు. కరోనా వ్యాక్సిన్లు ఎప్పటికప్పుడు వేయించారు.

వృద్ధుల సంక్షేమం కోసమే..



సంస్థ ఏర్పాటు నుంచి అనాథ వృద్ధుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నాం. వారు సంతోషంగా ఉండాలన్న కాంక్షతో తీర్థయాత్రలు తీసుకెళ్తున్నాం. సమాజానికి మంచి సందేశాన్ని ఇచ్చే సినిమాలు చూపిస్తున్నాం. వారి ఆరోగ్య పరిస్థితుల కోసం ఎప్పటికప్పుడు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. సంస్థలో ఆశ్రయం పొందుతున్న వారికే గాక పరిసర ప్రాంతంలో గల పేదలందరికీ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నాం. దాతల సహకారంతో ఎప్పటికప్పుడు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

సూరాడ అప్పారావు, అధ్యక్షుడు,
స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ.

వైభవంగా నీలమ్మ వేపచెట్టు అమ్మవారి తొలేళ్ల ఉత్సవం



దుర్గమ్మ ప్రతిమలతో తిరువీధిలో పాల్గొన్న మాలధారులు, ట్రస్ట్‌ బోర్డు సభ్యులు



తిరువీధి ఉత్సవంలో నీలమ్మ వేపచెట్టు అమ్మవారి పల్లకి మోస్తున్న మహిళా భక్తులు



నీలమ్మ వేపచెట్టు అమ్మవారిని దర్శించుకున్న ఎంఎల్‌సీ వరుదు కళ్యాణి, విజయలక్ష్మీ శ్రీనివాసరెడ్డి



దుర్గమ్మ ప్రతిమతో కూడిన బండి లాగుతూ తిరువీధి నిర్వహిస్తున్న ట్రస్ట్‌ బోర్డు సభ్యులు

అల్లిపురం: అస్సాం గార్డెన్స్‌లో వెలసిన నీలమ్మ వేపచెట్టు అమ్మవారి శివరాత్రి వార్షిక జాతర సందర్భంగా శుక్రవారం అమ్మవారి తొలేళ్ల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకుడు జోగారావు శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు భారీ ఎత్తున సారె తీసుకువచ్చి సమర్పించారు. సారె తిరువీధి ఉత్సవం అల్లిపురం బంగారమ్మమెట్ట, వెంకటేశ్వరమెట్ట, అస్సాంగార్డెన్స్‌ తదితర ప్రాంతాల ద్వారా అమ్మవారి గుడికి చేరుకుంది. అమ్మవారిని ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి దర్శించుకుని పూజలు చేశారు.

ఘనంగా అమ్మవారి తిరువీధి..

ఉత్సవం సందర్భంగా అమ్మవారి తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారి పల్లకి మోస్తూ తిరువీధి చేపట్టారు. ఈ సందర్భంగా మహిళల కోలాటం ఆకట్టుకుంది. అమ్మవారి మాలధారులు భక్తిశ్రద్ధలతో అగ్నిగుండం నిర్వహించారు. ఈ సందర్భంగా నీలమ్మ అమ్మవారి నామస్మరణతో పరిసరాలు మార్మోగాయి.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన చిన్నారుల నృత్య కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

నేడు ప్రధాన పండగ..

అమ్మవారి ప్రధాన పండగ సందర్భంగా శనివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో దేముళ్లు, ఆలయ ట్రస్ట్‌ బోర్డు చైర్మన్‌ బొర్రా విజయలక్ష్మీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

దుర్గాలమ్మ ఆలయంలో..

అల్లిపురం: శివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం పూర్ణామార్కెట్‌ దరి దుర్గాలమ్మ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం, తిరువీధి వైభవంగా నిర్వహించారు. అమ్మవారి మాలధారులు అమ్మవారి ప్రతిమలతో పూర్ణామార్కెట్‌, పండావీధి, అచ్చియ్యమ్మపేట, కల్లుపాకలు తదితర ప్రాంతాల్లో అమ్మవారి తిరువీధి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శనివారం అమ్మవారి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ ఈవో కీర్తి శ్రీనివాస్‌ తెలిపారు. ఆదివారం ప్రధాన పండగ సందర్భంగా దేవాలయ పరిసర ప్రాంతాల్లో రంగు రంగుల విద్యుత్‌ దీపాలతో అందంగా అలంకరించారు. తిరువీధి ఉత్సవంలో ఆలయ ట్రస్ట్‌ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన అవసరం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రపంచ మానవ హక్కుల సమితి ప్రతినిధులు

ఆరిలోవ : మానవ హక్కులపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ప్రపంచ మానవ హక్కుల సమితి (డబ్ల్యూహెచ్‌ఆర్‌సీ) జాతీయ చైర్మన్‌ ఆర్‌.బాలాజీ సూచించారు. ఆరిలోవ ప్రాంతం హెల్త్‌ సిటీలోని ఓ హోటల్‌లో మానవ హక్కుల ప్రతినిధుల రాష్ట్ర సమావేశం శుక్రవారం నిర్వహించారు. భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, అవగాహన సదస్సులపై చర్చించారు. అనంతరం సమితి కార్యాచరణతో కూడిన క్యాలెండర్‌ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హక్కులతోపాటు బాధ్యతలు తెలుసుకోవాలని సూచించారు. ప్రతి అంశంపైనా అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలలు, వృద్ధులు, మహిళలు తమకు జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నించడానికి ముందుకు రావాలని సూచించారు. సమాజంలో వివక్ష పెరిగిపోతోందని, దాని నుంచి బయటపడడానికి ప్రయత్నించాలన్నారు. యువతలో అవగాహన కలిగించడానికి విద్యార్థులకు కళాశాలల్లో మాక్‌ పార్లమెంట్‌ నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో విశాఖలోనే మాక్‌ పార్లమెంట్‌ కార్యక్రమాలు ప్రారంభిస్తామని తెలిపారు. జాతీయ జనరల్‌ సెక్రటరీ మధుబాబు, సమితి రాష్ట్ర విభాగం చైర్మన్‌ బి.కార్తీక్‌ రామ్‌, పి.ఎస్‌.ఆచారి పాల్గొన్నారు.

మార్చి 10 నుంచి కళాకారుల క్రికెట్‌ టోర్నమెంట్‌



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్‌ హరి వెంకట కుమారి తదితరులు

అల్లిపురం: విశాఖపట్నం కళాకారుల క్రికెట్‌ టోర్నమెంట్‌ బ్రోచర్‌ను మేయర్‌ గొలగాని హరి వెంకట కుమారి జీవీఎంసీలోని తన చాంబర్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాకారుల సంఘం అధ్యక్షుడు జనార్దన్‌ మాట్లాడుతూ జ్ఞానాపురం గోల్డెన్‌ జూబ్లీ స్కూల్‌లో మార్చి 10 నుంచి 12వ తేదీ వరకు క్రికెట్‌ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌ సీపీ ఫ్లోర్‌ లీడర్‌ బానాల శ్రీనివాసరావు, వీజేఎఫ్‌ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, విష్ణు పబ్లిక్‌ స్కూల్‌ ప్రిన్సిపాల్‌ యాదవ్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతతో లక్ష్య సాధన

ఏయూ క్యాంపస్‌: మనిషికి మానసిక ప్రశాంతత ఉంటే లక్ష్య సాధన సులభమవుతుందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. సహజ యోగ ప్రదాత మాతాజీ నిర్మలాదేవి శత జయంత్యుత్సవాలు శుక్రవారం ఏయూ స్నాతకోత్సవ మందిరంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను వీసీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి యాంత్రిక జీవనంలో ప్రజలు అనేక ఒత్తిళ్లకు గురవుతున్నారన్నారు. ఒత్తిళ్లను జయించేందుకు ప్రతి ఒక్కరు యోగా సాధన, ప్రాణాయామం చేయాలని సూచించారు. ఇటువంటి ఒత్తిడి లేనినాడే మానవుడు అనుకున్నది అత్యంత సులభంగా సాధించగలడని తెలిపారు. ఏయూ యోగా కేంద్రంలో ఎంఏ యోగా విద్యార్థులకు సహజ యోగాపై అవగాహన తరగతులు నిర్వహించాలని సూచించారు. డిప్యూటీ మేయర్‌ జియ్యాని శ్రీధర్‌ మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని వయస్సుల వారికి సహజ యోగా ఒక మానసిక శక్తిని అందించే సాధనంగా మారిందన్నారు. మాతాజీ నిర్మలాదేవి ప్రసాదించిన సహజ యోగ ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చునని చెప్పారు. రైటర్స్‌ అకాడమీ వ్యవస్థాపకుడు, సీనియర్‌ జర్నలిస్ట్‌ వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ నిరంతరం సహజ యోగా చేయడం వల్ల ఒత్తిళ్లు దరి చేరవని తెలిపారు. ఈ వేడుకలకు పెద్ద సంఖ్యలో వివిధ రాష్ట్రాల నుంచి సహజ యోగులు హాజరయ్యారు. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ ప్రతినిధులు రమేష్‌, సోంబాబు, కె.వెంకటరెడ్డి, రోహిణి, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సాగిన శోభాయాత్ర

మూడు రోజుల పాటు జరగనున్న నిర్మలాదేవి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శోభాయాత్ర వైభవంగా సాగింది. కోలాటం, ఆధ్యాత్మిక ప్రదర్శనల మధ్య మాతాజీ నిర్మలాదేవి చిత్రపటాన్ని రథంపై ఉంచి సహజయోగులు శోభాయాత్ర చేపట్టారు. బీచ్‌ రోడ్డులోని పార్క్‌ హోటల్‌ వద్ద ప్రారంభమైన ఈ శోభాయాత్ర సిరిపురం మీదుగా ఏయూ కాన్వొకేషన్‌ హాల్‌ వరకు సాగింది.

వాల్తేర్‌ డివిజన్‌లో రైల్వే జీఎం తనిఖీలు



డివిజన్‌ కార్యకలాపాలు పవర్‌పాయింట్‌ ప్రజంటేషన్‌ ద్వారా జీఎం మనోజ్‌ శర్మకు వివరిస్తున్న డీఆర్‌ఎం సత్పతి

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌ కోస్ట్‌ రైల్వే జనరల్‌ మేనేజర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా మనోజ్‌ శర్మ వాల్తేర్‌ డివిజన్‌ పరిధి పలాస–విశాఖపట్నం సెక్షన్‌లో డీఆర్‌ఎం అనూప్‌కుమార్‌ సత్పతితో కలిసి శుక్రవారం విండో ఇన్‌స్పెక్షన్‌ చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా పలాస–విశాఖపట్నం సెక్షన్‌లోని ట్రాక్స్‌, మలుపులు, వంతెనలు, పాయింట్స్‌ అండ్‌ క్రాసింగ్స్‌, సిగ్నలింగ్‌, పలు భద్రతా విషయాలను పరిశీలించారు. జీఎం, డీఆర్‌ఎంలతోపాటు ఈస్ట్‌ కోస్ట్‌ రైల్వే ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన వివిధ విభాగాల ప్రిన్సిపల్‌ హెడ్స్‌, వాల్తేర్‌ డివిజన్‌కు చెందిన బ్రాంచ్‌ అధికారులు పాల్గొన్నారు. జీఎం మనోజ్‌ శర్మ విశాఖ చేరుకున్న తరువాత డీఆర్‌ఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. డివిజన్‌ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పవర్‌ పాయింట్‌ ప్రజంటేషన్‌ ద్వారా జీఎంకు డీఆర్‌ఎం సత్పతి వివరించారు. యూనియన్‌ నాయకులు డీఆర్‌ఎం కార్యాలయంలో మనోజ్‌ శర్మకు స్వాగతం పలికారు.

ఉన్నత విద్యపై సమగ్ర అవగాహన అవసరం



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్‌ ఎస్‌ఏడీ పాల్‌ తదితరులు

అల్లిపురం: ప్రతి విద్యార్థికి ఉన్నత విద్యపై సమగ్ర అవగాహన అవసరమని బోర్డ్‌ ఫర్‌ కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌ త్రూ ఎడ్యుకేషన్‌ (బీసీడీ–ఈ) కో ఆర్డినేటర్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ ఎస్‌ఏడీ పాల్‌ అన్నారు. ఏవీఎన్‌ కళాశాలలో శుక్రవారం 'నో యువర్‌ ఏపీ–హయ్యర్‌ ఎడ్యుకేషన్‌ ఇనీషియేటివ్స్‌' అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రా యూనివర్సిటీ రీసోర్స్‌ పర్సన్‌గా వ్యవహరిస్తోందన్నారు. వివిధ రాష్ట్రాల్లో ఉన్నత విద్యా విధానంలో ఉన్న పథకాలు, ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రంలో ఉన్నత విద్య కోసం విద్యార్థులకు అందుతున్న పథకాలపై చర్చించారు. కళాశాల ప్రిన్సిపాల్‌ ఎం.సింహాద్రినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీన్‌ జి.శంకర నారాయణ, కాలేజీ బీసీడీ ఈ కో ఆర్డినేటర్‌ సంతోష్‌కుమార్‌, జువాలజీ హెచ్‌వోడీ డాక్టర్‌ ఎ.అర్చన, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్‌, కెమిస్ట్రీ హెచ్‌వోడీ కృష్ణకుమారి, ప్రెస్‌ అండ్‌ పీఆర్‌ కో ఆర్డినేటర్‌ పైడి రజని, విద్యార్థులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో ఆరోగ్యకరమైన పోటీ ఉండాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జోన్‌–4 కమిషనర్‌ శివప్రసాద్‌ తదితరులు

జగదాంబ : విధి నిర్వహణలో ఉద్యోగుల మధ్య ఆరోగ్యకరమైన వాతావరణం ఉండాలని జీవీఎంసీ జోన్‌–4 కమిషనర్‌ కె.శివప్రసాద్‌ అన్నారు. శుక్రవారం సూర్యాబాగ్‌ జోనల్‌ కార్యాలయంలో గ్రామ–వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో సమన్వయం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్‌ స్టేట్‌ ఎగ్జిక్యూటివ్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ పీవీ కిరణ్‌కుమార్‌, ఉపాధ్యక్షుడు ఈ. పవన్‌కుమార్‌, జనరల్‌ సెక్రటరీ రమణ, నాయకులు మురళీ, రాజేష్‌, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణపై అవగాహన కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీవో హుస్సేన్‌ సాహెబ్‌

మహారాణిపేట : ఆడ పిల్లల నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాల్లో గర్భస్థ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆర్‌డీవో డి.హుస్సేన్‌ సాహెబ్‌ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఉన్న ఆర్‌డీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో స్కానింగ్‌ కేంద్రాలను తనిఖీ చేసి సూచనలు చేయాలన్నారు. ఈ తనిఖీలు ప్రతి మూడు నెలలకు ఒకసారి చేసి నివేదిక ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు డాక్టర్‌ రమారెడ్డి, విక్టోరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఉషా ప్రసాద్‌, రేడియాలజిస్టు డాక్టర్‌ వందన శశికిరణ్‌, ఎన్‌జీవోలు ప్రజ్ఞాన్‌కుమార్‌, రామలక్ష్మి, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, దిశ పోలీసు స్టేషన్‌ ఎస్‌ఐ నీలిమ, ఉమెన్‌ హెల్త్‌ అధికారి డాక్టర్‌ బి. ఉమావతి, మానిటరింగ్‌ కన్సల్టెంట్‌ కె.శివాజీ తదితరులు పాల్గొన్నారు.

మహారాణిపేట సీఐ రమణమూర్తికి సత్కారం



మహారాణిపేట సీఐ రమణమూర్తికి మెమొంటో అందజేస్తున్న రవితేజ తదితరులు

అల్లిపురం: తాడివీధి, శ్రీ రామలింగేశ్వర ఆలయ అధ్యక్షుడు తాడి రవితేజ, కమిటీ సభ్యులు మహారాణిపేట సీఐ బండారు రమణమూర్తిని శుక్రవారం సత్కరించారు. తాడివీధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన ఆయనను అభినందించారు. కార్యక్రమంలో రామలింగేశ్వర ఆలయ కమిటీ కార్యదర్శి కోన శంకర్‌, భూపతి జయలక్ష్మి, కాటపల్లి రామకృష్ణమ్మ, చితకల వేణు, బొట్టా నూక, పెంట రవి, భూపతి చందు తదితరులు పాల్గొన్నారు.

యువతలో నైపుణ్యాభివృద్ధే లక్ష్యం



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న జేసీఐ ప్రతినిధులు

అల్లిపురం : యువతలో వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యంతో పాటు జీవనోపాధి అవకాశాలు పెంపొందించడమే తమ లక్ష్యమని జేసీఐ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్‌ సుశాంత్‌ తెలిపారు. నగరంలోని ఒక హోటల్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా జేసీఐ వైజాగ్‌ స్మార్ట్‌, జూనియర్‌ ఛాంబర్‌ ఇంటర్నేషనల్‌ యువతలో సానుకూల మార్పులకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. జేసీఐ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నాయకత్వ లక్షణాలు, మేనేజ్‌మెంట్‌, టీం స్కిల్స్‌, వృత్తి నైపుణ్యం తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 18 నుంచి 40 సంవత్సరాల వయసులో ఉన్నవారికి ఈ శిక్షణను అందిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జేసీఐ ప్రతినిధులు శిరీష్‌ దుండు, రజిత, సచిన్‌ కుర్తీకర్‌, వర్మ, విధి గుప్తా, రాజేష్‌, స్రవంతి, సంగీత, కావ్య తదితరులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్య ఉద్యానవనం సందర్శన



ఉద్యానవనాన్ని సందర్శించిన విద్యార్థులు

ఏయూ క్యాంపస్‌: పెదవాల్తేరులోని బయోడైవర్సిటీ పార్క్‌లోని జీవ వైవిధ్య ఉద్యానవనాన్ని శుక్రవారం గాజువాకలోని చైతన్య డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన విద్యార్థులు సందర్శించారు. వైవిధ్యమైన వృక్షజాతుల వివరాలు తెలుసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఎస్‌.చంద్ర మహాలక్ష్మి, అధ్యాపకులు రూపా, సూర్య కుమారి పర్యవేక్షణలో సుమారు 40 మంది విద్యార్థులు పార్క్‌ను సందర్శించి విశేషాలు తెలుసుకున్నారు. వీరికి పార్క్‌ నిర్వాహకుడు మంథా రామ మూర్తి పార్క్‌ ప్రత్యేకతలు, మొక్కల విశిష్టతలను తెలియజేశారు.

విరబూసిన మూన్‌ ఆర్కిడ్‌ : పార్క్‌ ఆవరణలో ఉన్న మూన్‌ ఆర్కిడ్‌ మొక్క పుష్పించింది. తెల్లని వర్ణం కలిగిన ఈ పుష్పాలు కనువిందు చేశాయి. ఆర్కిడేసి జాతికి చెందిన దీని శాస్త్రీయ నామం ఫాలెనోప్సిస్‌ అమాబిలిస్‌. ఈ పుష్పాన్ని మోత్‌ ఆర్కిడ్‌ అని కూడా పిలుస్తారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్‌ సౌత్‌

9010196663

Office mail : sakshiadvtvsp@gmail.com